# నానమ్మ

బెంగుళూర్ నించి బయల్దేరినప్పట్నించీ నా ఆలోచనలన్నీ నానమ్మ చుట్టే తిరుగుతున్నాయి. ఇక్కడ ఇంజనీరింగ్‌లో జాయినయ్యాక మూడేళ్లనించీ ఇంటికే వెళ్లలేదు. మమ్మీ, డాడీతో ఫోన్లో మాట్లాడటం తప్ప..

అలాంటిది... నానమ్మ చనిపోయిందన్న ఉత్తరం...

బస్సులో కూచున్నా నానమ్మే గుర్తొస్తూంది. మాకు అందమైన జీవితాన్ని నేర్పిన నానమ్మ... ముగ్గురు కొడుకుల్నే కాదు... అయిదుగురు మనవల్నీ, నలుగురు మనవరాళ్లనీ తానే తీర్చిదిద్దిన నానమ్మ. తాతయ్య ఏనాడో చనిపోయినా పెద్దదిక్కుగానిల్చింది.

నానమ్మ టీచర్‌గా రిటైరై ఆరేళ్లయింది.

రిటైరైన రోజే నానమ్మ కుంగిపోయినట్టుగా కన్పించింది... అప్పటికే ముగ్గురు కొడుకులు పెద్ద ఉద్యోగాల్లో వున్నారు.

తన ఆరువేల జీతాన్ని ఆ ఉమ్మడి కుటుంబానికే పెట్టేది ఏ కొడుకుచేత నయాపైసా పెట్టించలేదు అప్పటి వరకు... పెన్షనయ్యాక నానమ్మ జీతం రెండున్నర వేలు దాటకపోయేసరికి ఇంట్లో ఎవరికి వాళ్లు ఆర్థిక ఇబ్బందుల్ని సృష్టించుకొని... ఎడమొహం, పెడమొహంగా తప్పుకు తిరిగారు.

నాల్రోజుల్లో నానమ్మ మీది ప్రేమ మంచుగడ్డల్లా కరిగిపోయింది కొడుకులకీ, కోడళ్లకీ. ఫలితంగా నానమ్మకో గది కేటాయించారు. నులక మంచం వేసారు. ఆమెకో

ఒంటరి ప్రపంచాన్ని సృష్టించారు.

నేను ఇంజనీరింగ్‌లో జాయినవ్వడానికి బెంగుళూర్ వెళ్లేముందు నన్ను పిల్చింది.

"ఒరే మన్‌ప్రీతమ్... నువ్వెళ్లే ముందు మీ తాతయ్య ఫోటో ఒకటి ఎన్‌లార్జ్ చేయించి ఫ్రేమ్ కట్టించి తీసుకురారా! ఈ గదిలో పెట్టుకుంటాను." అంది. ఆమె కళ్లల్లోనూ గొంతులోనూ ఏదో అవ్యక్తమైన బాధ.

"ఫ్రేమ్ కాదు నానమ్మ. లామినేషన్ చేయించి తీసికొచ్చిస్తాను ఈ రోజే. సరేనా?' అన్నాను. నానమ్మ నాతల నిమిరింది.

ఆ తర్వాత నేను బెంగుళూర్ వచ్చాక నానమ్మ నించి మొదట్లో రెండు ఉత్తరాలు వచ్చాయి అంతే!

గ్రాట్యువిటీ డబ్బు లక్షన్నర వచ్చాక అవి పంచగానే మీ అమ్మలూ, నాన్నలూ చాలా ప్రేమగా చూసుకుంటున్నారనీ, మానవ జీవితాలన్నీ ఆర్థిక సంబంధాలతో పూర్తిగా ముడిపడ్డియంటూ రాసింది.

ఏదేమైనా నానమ్మని బాగా చూసుకుంటారన్న హ్యాపీలో వుండి పోయాను. హైవే మీద బస్సు ప్రయాణంలో నానమ్మని దర్శించుకుంటూ కళ్లు మూసుకున్నాను.

★ ★ ★

ఇంట్లో అడుగుపెట్టగానే వరండాలో నానమ్మ ఫోటో చూసి గుండె కదిలిపోయింది. గుండెపొరల్లో నిక్షిప్తమైన జ్ఞాపకాల శకలాలు కుప్పకూలుతుంటే పొంగుతున్న కన్నీళ్లతో అమ్మని పట్టుకొని బావురుమని ఏడ్చాను.

ఇంట్లో స్మశాన స్తబ్ధత పలుచబడుతోంది. చాలా సేపటివరకు ఏమీ మాట్లాలేక పోయాను. గొంతునరాలు ముడిపడ్డట్టు.

తెల్లారితేనే పదకొండోరోజు... పెద్దకర్మ, మా నాన్న బాబాయ్‌లు ఆ ఏర్పాట్లలో మునిగిపోయారు.

అన్నం తినేటప్పుడు అమ్మ మాత్రం చెల్లికి వచ్చిన పెళ్లి సంబంధం గురించి చెప్తోంది.

మర్నాడు ఇంటిముందు పెద్ద షామియానా వేసారు.

దాదాపు వెయ్యి మందికి సరిపడా వంటలు వండిస్తున్నారు. నానమ్మ ఫోటోకి భారీ మల్లెపూల దండ వేసారు. ముగ్గురు కొడుకులు పెద్ద ఉద్యోగస్తులే కాబట్టి పెద్ద పెద్ద

వాళ్ళే వచ్చి పలకరిస్తున్నారు.

బ్రాహ్మడి కార్యక్రమం అంతా అయ్యాక ఒక్కొక్కరూ నానమ్మ ఫోటోకి దండం పెట్టి భోజనం వైపు వెళ్తున్నారు. నామనసు కొంచెం పొంగింది. నానమ్మ పెద్దకర్మని ఇంత గొప్పగా జరిపిస్తున్నందుకు నానమ్మ ఆత్మ తప్పకుండా శాంతిస్తుంది. గర్వపడుతుంది కూడా!:

నానమ్మ ఫోటో తప్పిస్తే అది పెద్దకర్మలా కాదు పెళ్లిసందడిలా అన్పిస్తుంది. మా వాడలోని కొందరు పేద వాళ్లకి కాటన్ చీరెలు, దోవతులు పంచిపెట్టారు.

"మేమింత పెద్ద హోదాలో వుండడానికి మా అమ్మే కారణం సార్" అంటున్నాడు పెద్దనాన్న ఎవరితోనో.

"అందుకే ఆమె పెద్దకర్మ మాస్థాయిలో ఇంత గ్రాండ్‌గా చేస్తున్నామండీ" అన్నాడు ప్రక్కనే వున్న మా నాన్న.

" మా అమ్మది శిలా విగ్రహం కూడా మా తోటలో పెట్టించాలనుకుంటున్నాం కూడా"అని మాట కలిపాడు చిన్నాన్న. ఆ మాటలు విన్న పెద్దమనిషి " మీరు చాలు గ్రేట్ సన్స్ వెరీగుడ్, వెరీగుడ్" అన్నాడు.

మా నాన్నల ముఖాలు ఎంతగా వెలిగాయంటే... అమ్మ పోయిందన్న బాధ అసలే కన్పించలేదు అసలు పెద్దకర్మనేది ఎందుకు చేస్తారు? ఆత్మ శాంతించడానికి! కాని ఇక్కడ స్థాయిలూ, హోదాల ప్రదర్శన. జరుగుతుందానన్పించింది.

"ఆమె మాకు తల్లిలాంటిది. అందుకే అందరం కలిసి అనుకొని తొంభైవేలతో ఈ ఫంక్షన్ చేస్తున్నాం" అమ్మ ఎవరితోనో చెప్తోంది.

అమ్మ ఈ రోజు పట్టుచీరె కట్టుకొని, నగలు అలంకరించుకోవటమే నా మనసుకి కలుక్కుమంది. "మా ఇంట్లో అయిదారేళ్లనించి ఫంక్షనేమి జరగలేదు. అందుకే కాస్త గ్రాండ్‌గా...." పిన్ని చెప్తోంది.

ఇంతలో పనిమనిషి రంగమ్మ వచ్చి 'అమ్మగారు, ఆవిడగది శుభ్రం చేసానండీ..' అంది.

"ఎవరి గ దామ్మా" నేనడిగాను అమ్మని.

"అదేరా... మీ నానమ్మది. ఆవిడ పోయారు గదా! ఆ గదిని గెస్ట్‌రూమ్‌గా చేద్దామని...' అంటూ వెళ్ళింది.

అప్రయత్నంగా నా అడుగులు నానమ్మ గదివైపు సాగాయి.

గోడల నిండా విషాదం గూడుకట్టుకున్నట్టుగా వుందాగది. గోడ మీద తాతయ్య ఒంటరిగా నవ్వుతున్నాడు.

గదంతా శుభ్రంగా వున్నా... షెల్ఫ్‌లో దుమ్ము పట్టివున్న పుస్తకం కనబడింది. నానమ్మది భగవద్గీత అయివుంటుంది అనుకుంటూ ఆ పుస్తకం పై గల కవర్ మీది దుమ్ము దులిపి తీసాను.

భదవద్గీత కాదది... నానమ్మ డైరీ.

ఎక్కడో మధ్య పేజీ తెరిచాను.

**మే, ఇరవై నాలుగు.**

"గొంతెండి పోతుందని మొత్తుకున్నా ఎవరూ గుటికెడు ఐసునీళ్లు కూడా పోయలదు."

ఆ వాక్యం చదివి నా గుండె కవాటాలు ఫెటిల్మని చిట్లి పోయాయి. అ ప్రయత్నంగానే మరో పేజీ తీసాను.

**జూలై, పదహారు**

"నన్ను వీళ్లు బ్రతికించుకుంటున్నది కేవలం నా పెన్షన్ డబ్బుల కోసమేనన్న నిజం వాళ్లమాటల్లో ఈరోజు తెలిసాక నాకు చచ్చిపోవాలన్పిస్తోంది."

ఎక్కడో నా హృదయంతరాళల్లో భీకర కంపనాలు పాకి పోతున్నాయి. అతి కష్టంగా రాసినట్టున్నాయి ఆ అక్షరాలు.

**సెప్టెంబర్, ఏడు...**

"అంతా కలిసి వృద్దుల శరణాలయం హోమ్ ఏజ్‌డ్ హస్టల్ లో వేస్తామంటె వద్దని దు:ఖంతో చేతులెత్తి ప్రార్థించాను దయ కలిగి కరుణించారు."

**సెప్టెంబర్-పదకొండు...**

"మల మూత్రాలు మంచంలోనే చేసుకుంటున్నానని అన్నం పెట్టడం తగ్గించారు."

**అక్టోబర్-మూడు...**

"రెండు రోజుల్నించి నాకు కనీసం అన్నం కూడా లేదు. గదిలోకి ఎవరూ రాలేదు.'

' నా గుండెనెవరో ఇనుప చువ్వలతో పొడుస్తున్నట్లయింది.

ఆ తర్వాత నానమ్మ డైరీ నిండా తెల్లపేజీలే...

నానమ్మలాంటి తెల్ల పేజీలు...

నానమ్మ మనసులాంటి తెల్లపేజీలు...

కళ్లు కన్నీళ్లతో కప్పబడిపోయాయి. డైరీని గుండెలకు హత్తుకున్నాను. బావురుమంటూ మరోక్షణంలో నా గుండె పగిలేలా వుంది.

అప్పుడే గదిలోకి నాన్న వచ్చి,...

"ఒరే మన్‌ప్రీతమ్... నువ్విక్కడేం చేస్తున్నావ్? అక్కడ డిస్ట్రిక్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గారొచ్చారు కార్లో. ఆయనకేం అవసరాలు వున్నాయో చూడుపో... రేపు నీ ఉద్యోగానికి ఆయనతోనే మనకి పని... వెళ్ళెళ్లు..." అని చెప్పి వెళ్లిపోయాడు.

ఎక్కడికి వెళ్లాలో తేలీక నేను గదిలోనే వుండిపోయాను మూగగా రోదిస్తూ..

★ ★ ★